

చింతా మోహన్ ఓ నియంత

షర్మిలపై వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెస్ బాబు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలపై మాజీ ఎంపీ చింతామోహన్ చేసిన విమర్శలు అర్ధరహితమని పూతలపట్టు ఎంఎల్ఎ అభ్యర్థి ఎమ్మెస్ బాబు స్పష్టం చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భూస్థాపితమైన కాంగ్రెస్‌కు పూర్వవైభవం రావడానికి కారణం షర్మిలమ్మ అని పేర్కొన్నారు. సీనియర్ నాయకుడని చెప్పుకునే చింతామోహన్ పార్టీ కోసం ఏమీ చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. కొత్త వాళ్ళు రాకూడదనే ఉద్దేశంతో చింతా మోహన్ నియంతలా పనిచేయడంతో.. పదేళ్లుగా పార్టీకి మనుగడ లేకుండా పోయిందనీ ధ్వజమెత్తారు. వైఎస్ఆర్ ఆశయాలను సాధించేందుకు షర్మిలమ్మ ప్రయత్నిస్తుంటే.. ఆమెను వెనక్కు లాగేందుకు చింతా కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో షర్మిల డబ్బు తీసుకుని టికెట్ ఇచ్చారని ఆరోపించిన చింతా మోహన్ కాణిపాకం ఆలయంలో ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నారా అని సవాల్ విసిరారు. సమావేశంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్, నాయకులు రవి, వెంకటేష్, రాణి తదితరులు పాల్గొన్నారు.

తొలకరి జల్లులతో చిగురించిన

ఖరీఫ్ ఆశలు

- పొలాల బాట పట్టిన రైతన్నలు
- దుక్కులకు అదునుగా వర్షం
- సకాలంలో అందిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలు



ప్రజాశక్తి- వి కోట :

మండల పరిధిలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి జల్లులు మొదలు కావడంతో ఖరీఫ్ సీజన్ కోసం రైతన్నలు పొలంబాటకు పయనమయ్యారు. దుక్కులు దున్నేందుకు అదునుగా వర్షాలు కురుస్తుండడంతో వేరుశనగ వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. మరోపక్క ఎన్నికల హడావిడి చల్లారడంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి కూలీలకూ పనులు దొరికాయి.

పంట సాగుకు సన్నద్ధమైన రైతులు

మండల పరిధిలో గత ఖరీఫ్ సీజన్లో సకాలంలో వర్షాలు సక్రంగా కురకపోవడంతో అత్యల్పంగా రైతులు వేరుశనగ సాగుచేశారు. దానిని అధిగమించేందుకు ఈ సంవత్సరం వ్యవసాయశాఖ వారు ఆర్‌బికెల ద్వారా రైతులకు పలు సూచనలు సలహాలను ముందస్తుగా అందజేశారు. దుక్కులను దున్నడం, ఎరువులు వాడకం, విత్తన శుద్ధి తదితరాల గురించి అవగాహన కల్పించారు. ఈనెల 23 నుండి ఆర్బికేల ద్వారా మండల పరిధిలోని 18 గ్రామపంచాయతీలో సబ్సిడీపై వేరుశనగ విత్తనకాయలను అందజేస్తున్నారు. అదునకు ముందుగా సకాలంలో వేరుశనగ విత్తనాలు అందుబాటులోకి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ విత్తన కాయలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా తమ పొలాల్లో వేరుశనగను సాగు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఖరీఫ్‌లో అంతర పంటల సాగు పై రైతులకు అవగాహన కల్పించారు. నైరుతి రుతుపవనాలు రాను నేపథ్యంలో మండల పరిధిలో సాగులో ఉన్న వరి పంటల నూర్పిడలను త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేశారు.

తీరనున్న కూలీల సమస్య..

మండలంలో సార్వత్రిక ఎన్నికల హడావిడి ముగియడంతో కూలీల సమస్య తీరనున్నట్లు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సాగువిస్తీర్ణం పెరగనున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు కూలీల అవసరాలు పెరగనున్నాయి. టమోటా పంటకు సీజన్ కొనసాగుతుండడంతో కూలీల అవసరాలు మరింత పెరగనుంది. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో పొలం పనులు వేగంగా పెరగడంతో కూలీలకు చేతినిండా పనులు దొరుకుతున్నాయి. వ్యవసాయశాఖ వారు నిర్దేశించికున్న లక్ష్యాల మేరకు వేరుశనగ పంట సాగుకు రైతును సన్నద్ధం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం పై దీని ప్రభావం పడే పరిస్థితి నెలకొంది.

ఎన్నికల కోడ్.. ఆగిన రైతు భరోసా

గత సంవత్సరం రబీలో ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద సబ్సిడీ వేరుశనగ విత్తనాలు కొనుగోలుకు రైతు ఖాతాలో నగదు జమ చేసింది. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో రైతు భరోసా ఆగిపోవడంతో వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేసినందుకు రైతులు డబ్బుల కోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలలో పాలకుల తీరుకు ప్రజలు అలవాటు పడితే వ్యవస్థలో మార్పులు సంభవించినప్పుడు ఇటువంటి అవస్థలు తప్పవని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రైతులు సమాయత్తం కావాలి

- రాజ్యలక్ష్మి, మండల వ్యవసాయ శాఖ అధికారి



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు వర్షాలు మొదలు కావడంతో రైతులు వేరుశనగ సాగుకు దుక్కులుదున్ని పొలాలను సిద్ధం చేసుకోవాలి. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఆర్‌బికే సిబ్బంది క్షేత్రస్థాయిలో సాగును పరిశీలించి పంటను తప్పనిసరిగా నమోదుచేయాలి. వేరుశనగలో రైతులు విత్తనశుద్ధిని తప్పనిసరిగా పాటించి అంతర పంటల సాగుపై మొగ్గు చూపి అదనపు ఆదాయాన్ని పొందవచ్చు.

చెరకు సాగులో

మేలైన యాజమాన్యం



ఏపుగా పెరిగిన చెరకు పంట

ప్రజాశక్తి- కార్వేటినగరం: సాధారణంగా చెరకును జనవరి నుంచి మార్చి నెలల మధ్యకాలంలో సాగు చేస్తుంటారు. మొదటి దశలోనే తోటలు నీటి ఎద్దడికి గురైనప్పుడు తగిన విధంగా పోషకాలను గ్రహించలేవు.. ఈ సమస్య తలెత్తకుండా పోషకాలను ఆకుల ద్వారా అందించాలి. ఎరువుల ద్రావణాన్ని పైరుపై పిచికారీ చేయాలి.. నీటి వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో వేసవిలో వారం రోజులకొకసారి నీటితడి ఇవ్వాలి. పరిమిత నీటి వసతి ఉన్న రైతాంగం 10 నుంచి 15 రోజుల వ్యవధిలో నీటితడి ఇవ్వాలి.

తేమ శాతాన్ని కాపాడుకోవాలి...

నేలలో తేమ శాతాన్ని కాపాడేందుకు పంట బాల్యదశలో వరుసల మధ్య ఎకరాకు 1.25 టన్నుల చెరకు చెత్తను పరచాలి.. ఇది నీరు ఆవిరయ్యేశాతాన్ని తగ్గించి మల్గా ఉపయోగపడడమే కాక కుళ్లి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. బిందుసేద్యం విధానం దావ్రా నీరు ఇవ్వగలిగితే సాగునీటిని సమర్ధవంతంగా వినియోగించుకోవచ్చు. డ్రిప్ ద్వారా నేరుగా వేరువ్యవస్థకు నీరు అందించడం వలన నీరు సద్వినియోగం అవుతుంది.

ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు సంస్థ ద్వారా పెద్దమొత్తం రాయితీ డ్రిప్ పరికరాలను అర్హతగల రైతాంగం ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. నీటిని పొదుపుగా వాడుకోవడానికి ఎక్కువ విస్తీర్ణంలో పంటలు నీటివసతి ఆధారంగా సాగుచేయడానికి విద్యుత్‌ను, ఎరువుల ఖర్చును తగ్గించుకోవడానికి డ్రిప్ సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుంది.

చీడ పురుగుల నివారణ..

చెరకు పంటకు బాల్యదశలో పీకపురుగు బాగా నష్టం కలిగిస్తోంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. దీనిని పీక పురుగు సాధారణంగా భూమి పైభాగంలో ఉన్నటువంటి కాండాన్ని తొలచి లోపలి కణజాలాన్ని తినడం వల్ల పోషక పదార్థాల సరఫరా ఆగిపోయి చనిపోయిన మొవ్వులు ఏర్పడతాయి.. ఈ లక్షాలు ముచ్చెలు (చెరకు విత్తనపిచ్చెలు) నాటిన వారం నుంచి 120 రోజుల వరకు కనిపిస్తోంది. పీక పురుగు యాజమాన్యంలో ముఖ్యమైంది.. పంట వేయకముందు రెక్కనాగలితో తోతు దుక్కులు చేసుకోవాలి. దీని వల్ల గత సీజన్లో నేలలో ఉన్న పరుగులు బహిర్గతమై చనిపోతాయి. ఎండవేడిమి, పక్షుల వల్ల వీట సంతతి తగ్గిపోతుంది. దీని వల్ల 50శాతం పురుగు సాంద్రతను తొలిదశలోనే అరికట్టేందుకు వీలవుతుంది. ముచ్చెలను లోతైన కాలువల్లో నాటడం ద్వారా ఈ పురుగు ఉధృతి బాగా తగ్గించవచ్చు. మూడు కళ్ల ముచ్చెలను సుమారు 25 సెంటీ మీటర్ల లోతు కాలువల్లో నాటు కుంటే తేమ ఎక్కువగా ఉండటం వల్ల ఈ పురుగు బెడద తగ్గుతుంది. నాటిన మూడో రోజున చెరకు చెత్త (ఎండు చెరకకు)ను కప్పడం మరో యాజమాన్య పద్ధతి, దీన్ని కప్పడం వల్ల మూడు ప్రయోజనాలు రైతాంగానికి కలుగుతాయి. నేలలో తేమను కాపాడవచ్చు, పీక పురుగు సమస్య తగ్గుతుంది.

మంచి దిగుబడి సాధించవచ్చు

- హేమలత, వ్యవసాయ అధికారిణి, కార్వేటినగరం మండలం



చెరకు బాల్య దశలో ఎర్రనల్లి ఆశించే అవకాశముంది. ఇది ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడం వల్ల ఆకులు ఎండిపోతాయి. వీటి నివారణకు లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల చొప్పున డైకోఫాల్ మందును కలిపి పిచికారి చేయాలి. ఈ విధంగా చెరకు బాల్య పాటించడం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చు.

గ్రంథాలయం దయనీయం..



మూసి ఉన్న గ్రంథాలయ భవనం తలుపులు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన వేసవి శిక్షణాశిబిరం నిర్వహించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవి సెలవులలో పిల్లలు సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా పుస్తక పఠనంపై ఆసక్తి కనబరిచేందుకు విద్యార్థులను గ్రంథాలయాల వైపు మళ్లించడానికి ప్రతిఏటా గ్రంథాలయాలలో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తూ వస్తున్నారు. చిన్న వయసు నుండే పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించడం ద్వారా బాలల్లో వ్యక్తిత్వ వికాసం మానసిక ఉల్లాసం వృద్ధి చెందుతాయి. ఈ ఉద్దేశంతో జిల్లాలోని అనేక గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణాశిబిరాలను పిల్లలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఈనెల 15వ తేదీ నుండి జూన్ 7వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యార్థులకు సరదా కల్పిస్తూనే పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించే శిబిరాలను అందజేస్తున్నారు. కథలు చెప్పడం వినడం పుస్తక పఠనం చిత్రలేఖనం సజనాత్మక కార్యక్రమాలు యోగ తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. అయితే మండల కేంద్రమైన సోమలలోని గ్రంథాలయంలో గత ఏడాది వేసవి శిక్షణాశిబిరం జరిగిన తరువాత ఈ ఏడాది గ్రంథాలయంలో పనిచేసే గ్రంథాలయ అధికారి పదవీ విరమణ చేయడంతో కలికిరి గ్రంథాలయ అధికారి విజయ్‌కుమార్‌ను ఇన్చార్జి గ్రంథాలయ అధికారిగా నియమించారు. అటు కలికిరి మెయిన్ బ్రాంచ్‌లోను సోమల బ్రాంచ్ లోను విధులు నిర్వర్తించాల్సి రావడంతో ప్రతిరోజు గ్రంథాలయ తలుపులు తెరుచుకునే అవకాశం లేకుండా పోయింది. దీనిపై ఇన్చార్జి లైబ్రేరియన్ విజయ్ కుమార్‌ను చరవాణి ద్వారా వివరణ కోరగా ఇన్చార్జి బ్రాంచ్‌లలో వేసవి శిక్షణ శిబిరాలు ఎక్కడా నిర్వహించలేదని సిబ్బంది కొరత కారణంగా మెయిన్ బ్రాంచ్‌లలో మాత్రమే నిర్వహిస్తున్నారని తెలిపారు. సోమల శాఖ గ్రంథాలయానికి గ్రంథాలయ అధికారిని నియమించి ఇక్కడ విద్యార్థులకు యువకులకు గ్రంథాలయాల వల్ల కలిగే లాభాలను అందించే అవకాశం కల్పించాలని గ్రామస్తులు విద్యార్థులు యువకులు కోరుతున్నారు.



గత ఏడాది వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థుల చేత వివిధ రకాల యాక్టివిటీస్ చేయిస్తున్న గ్రంథాలయ అధికారి (ఫైల్ ఫోటో)

సంఘ విద్రోహశక్తుల ఏరివేతలో పోలీసులు

- ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

కౌటింగ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చిత్తూరు జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించారు. జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలో కౌంటింగ్ అనంతరం అల్లర్లు చోటు చేసుకుంటే పోలీసులు ఎలా రియాక్ట్ అవ్వాలో జిల్లా ఎస్పీ మణికంట చందోల్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రజల సమక్షంలో అలర్ల సందర్భంగా పోలీసులు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు.



జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్

మరోవైపు జిల్లాలోని సమస్యాత్మక నియోజవర్గాలోని పోలీస్ స్టేషన్లను ఎస్పీ స్వయంగా వెళ్లి తనిఖీలు నిర్వహిస్తూ పోలీసులను అలెర్ట్ చేస్తున్నారు. కౌంటింగ్ సమయంలో మరో తొమ్మిది రోజులుండటంతో ముందస్తుగా పోలీసులు అల్లర్లకు పాల్పడే రౌడీషీటర్లను అదుపులోకి తీసుకోవడంతోపాటు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తూ సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. 2024 సాధారణ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కేంద్ర పారా మిలటరీ దళాలు కవాత్తు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని, యవత తమ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఘర్షణలకు దూరంగా ఉండాలని పోలీసుశాఖ సూచిస్తోంది.

ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా అంతటా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీల పర్యవేక్షణలో జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు వారి సిబ్బందితో కలిసి ఆదివారం జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్ల పరిధిలలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ముమ్మరంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అక్రమంగా దాచి ఉంచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, బాణాసంచా, పెట్రోలు, డీజిల్ మాదక ద్రవ్యాలు, సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీన చేసుకోవాలని, పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు లక్ష్యంతో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రత్యేక బలగాలతో ఉదయం 5 నుంచి 7.30 గంటల వరకు చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి సబ్ డివిజన్లలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గల అన్ని మండలాలలో మరియు సమస్యాత్మక గ్రామాలలో డిఎస్పిల పర్యవేక్షణలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు.

పోలీసులు నిర్వహించిన ఆపరేషన్‌లో చిత్తూరు సబ్‌డివిజన్‌లోని చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకరయ్యగుంట, బాలాజీ నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించగా సరైన పత్రాలు లేని ఏడు ద్విచక్రవాహనాలు, ఆటోను సీజ్ చేశారు. అలాగే చిత్తూరు వెస్ట్ సర్కిల్ పరిధిలోని గుడిపాల మండలం రాసనపల్లి గ్రామంలో సరైన పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు 600 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. కల్లూర్ సర్కిల్ పరిధిలోని ఐరాల మండలం వివిఎస్ అగ్రహారం గ్రామం, అరుణనగర్ కాలనీలో సరైన పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలు, సదుం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చీకలచేను, సిఎం.గొల్లపల్లి, గాదేవారిపల్లిలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 2 ద్విచక్ర వాహనాలన స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు సర్కిల్ పరిధిలో గల ముదివారిపల్లిలో ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, కరిడిమడుగు కొండ ప్రాంతంలో 200 లీటర్ల నాటుసార ఊటను ధ్వంసం చేశారు. నగరి అర్బన్ పోలీసుస్టేషన్ పరిధిలో గల ఎస్‌సి.కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించగా 15 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేశారు.



నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే చర్యలు తప్పవు..

జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ సమయం, అనంతరం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, శాంతిభద్రతలను పరిరక్షించే ఉద్దేశంతో సంఘ విద్రోహ శక్తుల ఏరివేతే లక్ష్యంగా జిల్లా పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు అణచివేసి, అసాంఘీక శక్తుల ఏరివేతే లక్ష్యంగా జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలలో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఎన్నికల కౌంటింగ్ వరకు నిరంతరం అనుమానిత ప్రాంతాలలో కార్డన్ అండ్ సెర్చ్‌లు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను మీరి వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన, ఘర్షణలకు పాల్పడిన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర సమయాలలో నమోదు చేసే కేసులు కన్నా, ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసుల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. జిల్లా పోలీస్ అధికారులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించే సమయంలో ఎక్కడైనా బాణాసంచా లేదా బాటిల్లలో, క్యాన్‌లలో పెట్రోల్, డీజిల్ నింపి ఉంటే వాటిని సీజ్ చేయాలని, వాటిని ఎవరు విక్రయించారనే విషయాన్ని తెలుసుకొని వారిపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన, ఘర్షణలకు పాల్పడుతున్న వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు గాని, డయల్ 100/ 112 నెంబర్లకు కాని లేదా పోలీస్ నెంబర్ 94409 00005కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు.

టెక్నో, ఈటెక్నో, ఐఐటి కోచింగ్‌ల పేరుతో...

'తోకల' బిజినెస్



- సిబిఎస్ఇ సిలబస్ అంటూ అదనం
- ఫీజు నియంత్రణ పట్టని అధికారులు
- పేరెంట్స్ కమిటీలపై మీనమేషాలు

ప్రజాశక్తి- తిరుపతి

సిబిఎస్ఇపై మోజు, కార్పొరేటు స్కూళ్లపై వ్యామోహంతో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తున్నారు. ఇదే అదనుగా భావించి ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు స్కూల్ పేర్ల చివరన టెక్నో, ఈ టెక్నో, ఐఐటి, ఒలంపియాడ్, మోడల్, డిజిటల్, ఇంటర్నేషనల్, కాన్సెప్ట్ అంటూ తోకలు చేర్చి మరీ విద్యార్థుల తల్లిదండ్రులను బోల్తా కొట్టిస్తున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ పేర్ల చివర కేవలం ప్రైవేటు అనే ఉండాలి. తోక పేర్లు ఉండొద్దని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఇప్పటికీ అనేక బడులకు తోకపేర్లు దర్శనమిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని స్కూళ్లు బయట బోర్డు, బస్సులపై తొలగించినా, పేరెంట్స్‌కు పంపించే లెటర్లు, స్టూడెంట్స్ బుక్స్‌లో అవే దర్శనమిస్తున్నాయి. ఈ పేర్లతోనే కార్పొరేట్ మేనేజ్మెంట్లు పేరెంట్స్ నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

ఫీజులపై నియంత్రణేదీ?

ఫీజుల నియంత్రణలోనూ ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అయితే నిబంధనలను పక్కన బెట్టి ఈ విద్యాసంవత్సరాని (2024-25)కి గాను పలు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు భారీగా పెంచాయి. ప్రస్తుతం ఉన్న ఫీజుల కంటే 15 నుంచి 20శాతం వరకు పెంచినట్లు విద్యార్థి సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్ అంటూ ఈ ఏడాది (2024-25) 1వ తరగతి నుంచి 3వ తరగతి వరకు రూ.70వేల నుంచి రూ.90వేలు, 4వ తరగతి నుంచి 6వ తరగతి వరకు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, రూ.80 వేలు నుంచి లక్షా ఇరవై వేల వరకు ఫీజులు వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. మంగళంలో ఇటీవలే ఏర్పాటు చేసిన ఓ ప్రముఖ సిబిఎస్ఇ విద్యాసంస్థలో టర్మ్ ఫీజులను వసూలు చేసి మరీ అడ్మిషన్లను ముగించేయడం గమనార్హం. ప్రతిఏడాది ఆయా పాఠశాలల యాజమాన్యాలు 20 శాతం నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతూనే ఉన్నా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పేరెంట్స్ కమిటీలపై మీన మేషాలు

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయంలో సరైన నియంత్రణ లేకపోవడంవల్ల పాఠశాలల యాజమన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఫీజుల విషయంలో ఈ కమిటీ నిర్ణయం తీసుకోవాలి. అలాంటిది ఏ ఒక్క పాఠశాలలో అమలు కావడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయంలో ఒక్కసారి కూడా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ సారైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పేరెంట్స్ కమిటీలను పటిష్టంగా అమలు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

ఆధార్ ఆమె బేజార్



తల్లి, కుమారుడి జననం 1997గా నమోదైన ఆధార్‌కార్డులు

- ఆధార్ నమోదులో దొర్లిన తప్పిదం
- తల్లి వయసు 27కాగా ఆమె కుమారుడికీ 27 కావడమే వింత
- తప్పిదాన్ని సరిచేయాలని అధికారులకు వేడుకోలు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: ఆధార్ కార్డు నమోదు సమయంలో దొర్లిన తప్పిదం కారణంగా ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ ఫథకాలతో పాటు అనేక సందర్భాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆధార్ నమోదు కేంద్రం వద్ద, అధికారుల వద్ద సంప్రదించినా సరైన జవాబు అందకపోవడంతో బేజారు పడుతోంది. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం గ్రామానికి చెందిన లేట్ బాబు శెట్టి భార్య వరలక్ష్మి(53). 2011 అక్టోబర్ 31 న కొత్తగా ఆధార్ కార్డు పొందారు. ఆ కార్డులో 1997లో పుట్టినట్లు ఉంది. కొన్నాళ్ల క్రితం ఆమె డ్వాక్రా మహిళలతో కలిసి రుణం కోసం సప్తగిరి గ్రామీణ బ్యాంకుకు వెళ్ళగా వయసు ఆధార్ కార్డులో ఒకరకంగా రేషన్ కార్డులో మరొక రకంగా ఉండడంతో సరి చేసుకోవాలని సూచించి పంపారు. దీంతో ఆమె ఆధార్ నమోదు కేంద్రంలో సంప్రదించింది. స్టడీ సర్టిఫికేట్ ఒరిజినల్ లేకపోవడంతో అక్కడ వయస్సు మార్చడానికి ఆధార్ కేంద్రం నిర్వాహకులు నిరాకరించారు. తప్పనిసరిగా మార్క్సులిస్ట్ ఒరిజినల్ కావాలని వారు తేల్చి చెప్పారు. వరలక్ష్మీ 1975-80మధ్య పూతలపట్టు పాఠశాలలో ఐదవ తరగతి వరకూ చదివింది. ఆ ప్రకారం ఆమె వయస్సు 52ఏళ్లు. కాగా ఆమె కుమారుడు నవీన్ కుమార్ 1997 జూన్ 18వ తేదీన జన్మించాడు. ఇప్పటికి నవీన్‌కుమార్ వయస్సు 27ఏళ్లు నిడింది. ఆధార్ నమోదులో దొర్లిన తప్పిదం వల్ల తల్లి, కుమారిడి ఇద్దరి వయస్సు 27ఏళ్లుగా కావడం కొసమెరుపు. ఆధార్ నమోదులో ఏర్పడ్డ తప్పిదం కారణంగా ఆమె ఏళ్లనాటి నుంచి సతమతమవుతోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. స్థానిక పత్రికా విలేకరులకు సమస్యను చెప్పుకొంది. అధికారులు స్పందించి ఆధార్‌లో వయస్సు మార్పించాలని కోరింది.

కృష్ణారెడ్డి సేవలు మరువలేనివి..

- ఆర్‌జేడీ రాఘవరెడ్డి

ప్రజాశక్తి - పూతలపట్టు: పూతలపట్టు ఎంఈఓ కృష్ణారెడ్డి విద్యాశాఖకు చేసిన సేవలు మరువలేనివని ఆర్‌జేడీ రాఘవులు కొనియాడారు. ఈనెల 31న పూతలపట్టు-1 ఎంఈఓ కృష్ణారెడ్డి పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని బాలాజీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాలల అభివృద్ధికి, ఆయన చేసిన సేవలపై కొనియాడారు. అదేవిధంగా ఎస్సీఆర్టీ అడిషనల్ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగం పట్ల ఆయనకు ఉన్న అంకితా భావాన్ని వివరించారు. 40సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో చిన్న మచ్చ లేకుండా పదవీ విరమణ పొందడం హర్షనీయమన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డిని ఆదర్శంగా తీసుకొని ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని కోరారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన తోటి ఎంఈఓలు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.



కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రతి నెలా చివరి ఆదివారం జైన్ సంఘం నేతృత్వంలో ఉచిత కంటివైద్య శిభిరం నిర్వహిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదనే ఆంక్షలతో రెండు నెలలగా ఉచిత కంటివైద్య శిభిరం నిర్వహించడం ఆపేశారు. పోలింగ్ ముగియడంతో ఈనెల చివరి ఆదివారం జైన్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రాముల గుడివీధిలోని జైన్ ప్రార్థనామందిరంలో తిరుపతి అరవిందో ఆసుపత్రి వైద్యలచే ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహించారు. 198మందికి కంటి పరీక్షలు నిర్వహించి 115మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జైన్ సంఘం ప్రతినిధి సుబాష్‌జౌన్ మాట్లాడుతూ ఆపరేషన్ కోసం ఎంపికైన వారికి ఉచిత రవాణా, భోజనం, వసతి సౌకర్యాలతో ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు.

జగన్‌కు మద్ధతుగా ప్రజా తీర్పు..

- జిల్లా యూత్ అధ్యక్షులు హేమంత్ రెడ్డి


హేమంత్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: మరో సారి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి పట్టం కట్టే విధంగా వచ్చే నెల 4న నిర్వహించే ఓట్ల లెక్కింపులో ఓటర్ల తీర్పు ఉంటుందని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు హేమంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ విశాఖ వేదికగా జూన్ 9న మళ్ళీ సీయంగా జగన్‌మోహన్ రెడ్డి చేయబోయే ప్రమాణస్వీకార మహోత్సవానికి రాష్ట్ర ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి జగనన్న విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్ మెంట్, వైయస్ఆర్ ఆసరా, వైయస్ఆర్ చేయూత, రైతులకు ఇన్ పుట్ సబ్సిడీలను డీబీటి ద్వారా నేరుగా సీయం జగన్ కోట్లాది రూపాయల మేర నిధులు లబ్దిదారులకు జమ చేయించారని అన్నారు. సామాన్య ప్రజల కష్టాలు, ప్రజా సంక్షేమం తెలిసిన జగన్ మోహన్ రెడ్డి నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు.

చి(చె)త్త శుద్ధి ఏదీ..?

- నీరుగారుతున్న స్వచ్ఛాంధ్రా మిషన్ లక్ష్యం
- గ్రామాల్లో అడుగడుగునా అపరిశుభ్రం
- శుద్ధికి నోచుకోక.. చెత్తసేకరణ కానరాక అంతా అస్తవ్యస్తం
- వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోందని కార్మికుల గగ్గోలు
- నామమాత్రం కూడా నోచుకోని అధికారుల చర్యలు




ప్రజాశక్తి-గంగవరం: గ్రామ, పట్టణాల్లో రోజు వారి తడి, పొడి చెత్తను సేకరించి దాని ద్వారా సంపదను సృష్టించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛాంధ్ర మిషన్‌ను ఏర్పాటు చేశాయి. అందులో భాగంగా ప్రజాధనాన్ని లక్షలు వెచ్చించి గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలను నిర్మించారు. ఆ కేంద్రాల్లో తడి, పొడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువును తయారు చేసి తద్వారా రైతులకు అమ్మాలనేదే ముఖ్య ఉద్దేశం. వచ్చిన ఆధాయాన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధి అవసరాలకు వినియోగించాలన్న సదుద్దేశంతో కార్యచరణకు శ్రీకారం చుట్టారు. సంకల్పం గొప్పదైనా అధికారుల చొరవ లేకనో, సిబ్బంది అలసత్వమో కానీ స్వచ్ఛాంధ్ర మిషన్ లక్ష్యం నామమాత్రపు చర్యలకు కూడా నోచుకోవడం లేదు.

కోట్ల ప్రజాధనం వృథానేనా..

స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా ప్రభుత్వం అన్ని గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. గంగవరం మండలంకి సంబంధించి 16 చెత్త సేకరణ కేంద్రాలను నిర్మించారు. అక్కడ మీటర్లు, ఎల్ఈడీ బల్బులు కూడా ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు దాదాపు 9లక్షల వరకు ఖర్చు చేశారు. 35మంది కార్మికులు గతంలో అక్కడ పని చేసేవారు.

చాలీచాలని వేతనాల చెల్లింపుల్లోనూ జాప్యం..

చెత్తసేకరణ ఆగిపోవడం, చాలీ చాలని వేతనాలను సకాలంలో చెల్లించకపోవడం వంటి ఇబ్బందులు ఎదుర్కొన్నామని కార్మికుల వాపోతున్నారు. కుళ్లిన చెత్త, జంతువుల కళేబరాలు కుళ్లి దుర్వాసన వస్తున్నా చెత్త చెదారాన్ని సేకరించేవాళ్లమని, ఉదయం 5గంటలు మొదలుకొని మధ్యాహ్నం 12గంటల వరకూ కష్టించి పని చేస్తే నెలకు రూ.6వేల వేతనం ఇచ్చేవారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు అందడం లేదు..

స్వచ్ఛభారత్ కింద 15వ ఆర్థిక సంఘం నుంచి చెత్త సేకరణ కేంద్రాలకు నిధులిచ్చేవారు. ప్రస్తుతం నిధులు నిలిపివేయడం, పనులు ఆగిపోవడం జరిగింది. దీంతో పాటు విద్యుత్ చార్జీలు, ఎల్ఈడీ బల్బులు, అక్కడ మరమ్మతులకు సంబంధించి నిధులు రాలేదు. వేతనాలు సకాలంలో అందకపోవడంతో కార్మికులు ముందుకు రావడం లేదు. ప్రత్యేకించి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే మళ్లీ చెత్త సేకరణ జరుగుతుంది.

- ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి

సిఐటియు జిల్లా అధ్యక్షులుగా గిరిధర్ గుప్తా



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశం ఆదివారం వాడ గంగరాజు అధ్యక్షతన చిత్తూరులో జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో కార్మికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తులో ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి జిల్లా అధ్యక్షులుగా గిరిధర్ గుప్తాను ఎన్నుకోవడం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షురాలుగా మమతను ఎన్నుకున్నారు. నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తులో జిల్లాలో అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, హమాలీ, బిల్డింగ్, ఆటో, వీవోఏ కార్మికుల సమస్యలపై బలమైన పోరాటాలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం సిఐటియు కృషి చేస్తుందని తెలిపారు. కార్మికుల పక్షాన నిలబడే సిఐటియుని బలోపేతం చేయాలని యూనియన్ పిలుపునిచ్చింది. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేంద్రన్, జిల్లా ఉపాధ్యక్షులు షకీలా, కార్యదర్శి గంగ, జ్యోతి పాల్గొన్నారు.

తప్పతాగి వాహనం నడిపితే కఠిన చర్యలు: ఎస్ఐ


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-సోమల: వాహన చోదకులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే తీవ్రంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎస్ఐ వెంకట నరసింహులు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనాల తనిఖీల కార్యక్రమాన్ని చేపట్టారు. పలు వాహన చోదకులను ఆపి తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంగ జాతరకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: బంగారుపాళ్యం మండలంలోని వజ్రాల బోయకొండ గంగమ్మ, బంగారుపాళ్యం, మొగిలి వెంకటగిరి, ఆర్ఆర్ నగర్, గంగమ్మ ప్రతిష్ఠించేందుకు చలవ పందిళ్ల ఆలయాలు ముస్తాబ్ చేసి విద్యుత్ అలంకరణలతో సుందరంగా అలంకరించారు. నేటి నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గంగమ్మ మొక్కులు తీర్చుకుంటున్నట్టు గంగ పండగలో ఎన్నికల నియమావళిని అనుసరించి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

89 పెద్దురులో పోలీసుల కవాతు..

- సామరస్యంగా ఉండాలని గ్రామస్తులకు సూచన


గ్రామస్తులకు పలు సూచనలు చేస్తున్న డీఎస్పీ

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని 89 పెద్దూరు గ్రామంలో కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ గ్రామంలో జరుగుతున్న గొడవలు సంబంధించి ఆ గ్రామ ప్రజలు, గ్రామ పెద్ద మనుషులతో సమావేశం ఏర్పాటు చేసి ఎలాంటి గొడవలు జరగకూడదని వారికి సూచించారు. ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కంకర పరిచారు.. తారు మరిచారు..



- భయం గుప్పెట్లో వాహనదారులు
- కైగల్ రూట్లో వెళ్లాలంటే గగనమే

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కొత్తూరు పంచాయతీలో గల కొత్తూరు రామసముద్రం శెనిపల్లి గ్రామంలోని ప్రజలు పలమనేరు టు కుప్పం జాతీయ రహదారిలోని కైగల్ ప్రాంతానికి చేరుకోవాలంటే రోడ్డుపై ద్విచక్ర వాహనంలో ప్రాణం గుప్పెట్లో పెట్టుకొని అష్ట కష్టాలతో ప్రయాణించాల్సి వస్తోందని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత టిడిపి ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు కైగల్ నుంచి రామసముద్రం కొత్తూరు గ్రామాల వైపు ఉన్న జాతీయ రహదారిలో కంకర పరిచారు. అప్పట్లో ప్రభుత్వం చేయలేకపోయింది. కానీ ఈ ఐదేళ్ల కూడా ఆ రోడ్డు గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. రాత్రి సమయంలో గ్రామాన్ని చేరుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతూ చేరుకోవాల్సి వస్తోందని స్థానికులంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని రామసముద్రం, కొత్తూరు గ్రామాల ప్రజల ఆకాంక్ష. ప్రయాణాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

జనుము, జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి: ఏవో

ప్రజాశక్తి-సదుం: మండల పరిధిలో రైతులకు పచ్చ రొట్ట ఎరువులుగా ఉపయోగపడే జనుము విత్తనాలు-60క్వింటాళ్ళు, జీలుగ విత్తనాలు-60క్వింటాళ్ళు అన్ని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో వున్నాయని ఆదివారం వ్యవసాయ అధికారి హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. జనుము, జీలుగ 10కేజీలు బ్యాగ్ 50శాతం సబ్సిడీతో రూ.440లకు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జనుము, జీలుగ పచ్చి రొట్ట ఎరువులుగా ఉపయోగపడే విధానాలపై ఆయన రైతులకు సూచనలు చేశారు. జనుము మామిడి తోటల మధ్య, జీలుగ వరి పంటకు ముందు వరి మళ్ళుల్లో ఈ విత్తనాలు చళ్ళుకొని జులై, ఆగస్టు మొదటి వారంలో రొటావేటర్ యంత్రంతో దున్నుకొన్నట్లయితే భూమిలో ఈ మొక్కలు భూమిలో బాగా కలిసి పోయి నత్రజని శాతం పెరిగి భూమి సారవంత మవుతుందన్నారు. భూ సారం పెరుగుతుందన్నారు. వాన పాములు వృద్ధిచెంది, భూ సారం కు ఉపయోగపడుతాయన్నారు. జనుము, జీలుగు మొక్కలు వర్షం నీటిని ఎక్కువగా పీల్చుకొని భూమి శాంతంగా వుండే విధంగా దోహద పడుతాయన్నారు. కలుపు మొక్కలుశాతం తగ్గుతాయన్నారు. రసాయన ఎరువులు, యూరియా లాంటి రసాయన ఎరువులకు ప్రత్యామ్నయంగా పచ్చ రొట్ట ఎరువులుగా ఈ విత్తనాలు బాగా ఉపయోగ పడుతాయన్నారు. రైతులు రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జనుము, జీలుగ విత్తనాలు ఈ ఖరీఫ్ సీజన్ విత్తుకోవాల్సిందిగా ఆయన రైతులకు సూచనలు చేశారు.

బాల సుందరం రెడ్డికి నివాళి




ప్రజాశక్తి-వికోట: మాజీ జెడ్పిటిసి సభ్యులు సీనియర్ నాయకులు బాలసుందరం రెడ్డి మృతి బాధాకరమని చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొద్దిరోజులుగా వృద్ధాప్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ శనివారం బాలసుందరం రెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేర్ మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డితో కలసి ఆదివారం బాలసుందరం రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారి కుటుంబీకులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. అనంతరం బాలసుందరం రెడ్డి సేవలను ఆయన కొనియాడారు. జెడ్పిటిసి సభ్యులుగా పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలను అందించేందుకు అహర్నిశలు కృషి చేశారని, తనకు వ్యక్తిగతంగా రాజకీయాలలో సుపరిచితులని క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరుగా రాజకీయాలలో రాణించారని గుర్తు చేశారు. నేడు ఆయన లేని లోటు తనకు వ్యక్తిగతంగా తీర్చలేనిదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలం యామదానపల్లి ధర్మరాజుల ఆలయంలో మహాభారతంలో భాగంగా ఆదివారం ఘనంగా రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొని రథాన్ని భక్తి శ్రద్దలతో గుడి చుట్టూ లాగుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా ఈ మహాభారత ఘట్టంలో భాగంగా అర్జునుడు ఆవులు తిప్పుట అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అలరించిన దుర్యోధన వధ


హోరాహోరీగా తలపడుతున్న భీమ, దుర్యోధనుడు

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లిలో నిర్వహిస్తున్న ద్రౌపదీ ధర్మరాజుల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి గ్రామ వీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవ మూర్తులను ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన దుర్యోధన వద్ద గట్టం వద్ద భీముడు దుర్యోధనుడిని గంగమడుగు నుంచి తీసుకొచ్చే గట్టం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. అదే విధంగా దుర్యోధునుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంట తడిపెట్టించింది. అనంతరం భీముని వేషదారి దుర్యోధునుడిని వధించడం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ధర్మకర్తలు ధనగిరిరెడ్డి, బాబురెడ్డి, భక్తులు పలువురు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అగ్ని గుండ ప్రవేశం

మహాభారత ఉత్తవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో భాగంగా అగ్నిగుండ ప్రవేశ భక్తులు పూలమాలలు ధరించి, వేపాకులు చేపట్టి భక్తులు చేసిన గోవిందనామస్మరణాలతో ఆలయ ఆవరణం మారుమోగింది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలయ నిర్వాహకులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకుంటున్న నాటకాలు


రాత్రి నాటకాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని భారతం మిట్ట వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞంలో రాత్రివేళ కళాకారులు ప్రదర్శిస్తున్న నాటకాలు తిలకించడానికి వచ్చే ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి వారిచే సదాశివ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాత్రి నాటకాలు, కళాకారులు, వేషకాలు కట్టి ప్రదర్శన ఇస్తుంటే ప్రేక్షకులు చప్పట్లతో వారిని మరింత వారి కళారూపాలను ఉత్సాహపరుస్తూ ఆస్వాదిస్తున్నారు. ప్రక్క వాయిద్యాలు, వీనుల విందైన సంగీతంతో మరింత రంజింప చేస్తుండడంతో మహాభారతంలో నాటకాలను తిలగించడానికి వచ్చిన భక్తులు రెప్పవాల్చకుండా నాటకాలను చూస్తున్నారు.


నాటక ప్రదర్శన తిలకించడానికి వచ్చిన జనం

నేటి నుంచి శ్రీ సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు




ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లి, తిరుమలనాయని కుప్పం గ్రామం మధ్య నెలకొన్న శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం అంకురార్పణ, మంగళవారం ధ్వజావారోహణ, సాయంత్రం గిరిజాకళ్యాణోత్సవం, రాత్రి వృషభ వాహనోత్సవం, బుధవారం మధ్యాహ్నం బ్రహ్మ రథోత్సవం, గురువారం రాత్రి మొక్కుబడి ఉత్సవాలు, అగ్నిగుండ ప్రవేశం, శుక్రవారం ఉదయం వసంతోత్సవం కార్యక్రమంలు జరుగుతా యన్నారు. ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటుందని భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యువతిపై దాడి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వ్యవసాయ పొలం వద్దకు వచ్చిందంటూ నందిని అనే యువతిని అన్న కొడుకు దాడి చేసిన సంఘటన శనివారం రాత్రి గుడిపాల మండలం చిత్తపారలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు పొలం తగాదాలు నడస్తున్న సమయంలో నందిని పొలం వద్దకు రావడంతో రెచ్చిపోయిన విజయ్ నందినిపై దాడిచేసి గాయపర్చడం జరిగిందని ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు గాయపడ్డ నందిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో పాటు పోలీస్‌కు పిర్యాదు చేసిన్నట్లు తెలిపారు. విజయ్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపాల పోలీసులు తెలిపారు.

పోలీస్ స్టేషన్లోనే దాడికి యత్నించారు..

- వైసీపీ నేతలపై టిడిపి మండల అధ్యక్షుడి ఫిర్యాదు

ప్రజాశక్తి-రామకుప్పం: పోలీస్ స్టేషన్‌లోనే తనను దుర్భాషలాడుతూ.. తనపై దాడికి ప్రయత్నించారంటూ, 89 పెద్దూరుకు చెందిన వైసిపి నేతలపై టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి ఆదివారం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 89పెద్దూరు గ్రామంలో తమ పార్టీ కార్యకర్తలపై వైసీపీ నేతలు దాడి చేసి తీవ్రంగా గాయపరచగా వారు కుప్పం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో శనివారం రాత్రి 89 పెద్దురుకు చెందిన తమ పార్టీ కార్యకర్తలను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారన్న సమాచారం తెలుసుకొని రాత్రి 8:30 గంటల ప్రాంతంలో కొందరు నేతలతో కలిసి తాను పోలీస్ స్టేషన్ను చేరుకున్నానన్నారు. అక్కడ సర్కిల్ ఇన్స్పెక్టర్ను కలవడానికి వేచి ఉండగా పెద్దూరుకు చెందిన వైసిపి నేతలు వెంకటేష్, వెంకటరమణ, హేమ కుమార్, జగదీష్‌లతోపాటు 20మంది కార్యకర్తలు ఒక్కసారిగా పోలీస్ స్టేషన్‌లోకి చొచ్చుకొని వచ్చారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. వచ్చిన వెంటనే వారు తనను దుర్భాషలాడుతూ, దాడికి ప్రయత్నించారన్నారు. స్టేషన్ బయటకు రా.. నీ అంత చూస్తాం.. మా గ్రామంలోకి వస్తే నీ కథ చూస్తాం.. అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ని ఉద్దేశించి అంతా వాడే చేస్తున్నాడు, వాడి అంతు చూస్తాం అంటూ రెచ్చి పోయారన్నారు. వైసీపీ శ్రేణుల వీరంగం అంతా స్టేషన్ లోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉంటుందని, ఆ రికార్డులను పరిశీలించి తనపై దాడి యత్నానికి పాల్పడ్డ వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆనంద రెడ్డి తన ఫిర్యాదులో కోరారు.